క్లుప్తంగా

'వసతి' పెంపునకు కృషి



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో హాస్టల్ సీట్ల పెంపునకు కృషి చేస్తామని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కళాశాలను సందర్శించిన ఆయన సుదూర ప్రాంతాల నుంచి హాస్టల్ వసతి కోసం లగేజీలతో కాలేజీ ఎదుట నిరీక్షిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. పేరుగాంచిన కళాశాలలో సీటు రావడం అదృష్టమని, టీటీడీ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ నటుడు



ఆలయం వెలుపల జయరామ్

తిరుమల : తిరుమలలో శ్రీవారిని సినీ నటుడు జయరామ్ కుటుంబ సమేతంగా మంగళవారం బ్రేక్ దర్శన విరామ సమయంలో సేవించుకున్నారు. ఆయనకు టీటీడీ సిబ్బంది శ్రీవారి ప్రసాదాలను అందించారు. ఆలయం వెలుపల జయరామ్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు.

హుండీలో నగదు చోరీ



దుండగులు పగులగొట్టిన హుండీ

పాకాల: గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ఆలయంలో హుండీని పగలగొట్టి నగదును అపహరించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. పాకాల–నేంద్రగుంట మార్గం మధ్యలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న బొంతల గంగమ్మ ఆలయంలో రోజు పూజలు నిర్వహించే లావణ్య మంగళవారం ఆలయానికి చేరుకుంది. హుండీ పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులకు సమాచారం అందించింది. హుండీలో సుమారు రూ.5 నుంచి రూ.7 వేలు నగదు చోరీకి గురైనటుఅంచనా వేస్తున్నారు.

పిల్లలకు ఉచితంగా అల్బెండాజోల్ మాత్రలు



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఎంహెచ్‌ఓ

తిరుపతి అర్బన్: జిల్లాలోని 1–19 ఏళ్లలోపు పిల్లలకు ఉచితంగా అల్బెండాజోల్ మాత్రలను ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్‌తో కలసి క్రిమిరహిత పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నీటి సమస్య పరిష్కారానికి వినతి



వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని గర్ల్స్ హాస్టల్–1లో నీటి సమస్య పరిష్కరించాలని పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆర్.ఆషా కోరారు. మంగళవారం ఈ మేరకు విద్యార్థులతో కలసి వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ హాస్టల్‌లో రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా నిలిచిపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వందల మంది విద్యార్థినులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, కళాశాలకు సైతం వెళ్లలేని దుస్థితిలో ఉన్నారని మండిపడ్డారు. నేతలు స్రవంతి, బాలాజీ, అజయ్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

తిరుపతి క్రైం: తిరుపతి రైల్వే స్టేషన్ పరిధిలో పసువులేటి వెంకటరమణ(57) అనే వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్లు భావించి, ఆ దిశగా విచారణ జరుతున్నారు. మృతుడు తిరుపతి నగరంలోని శివజ్యోతినగర్‌కు చెందిన వ్యక్తిగా తిరుపతి రైల్వే పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌సీపురంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మోహిత్ రెడ్డి



పాకాలలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మోహిత్‌రెడ్డి తదితరులు



హామీలన్నీ హాంఫట్!

''ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెప్పేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నీ హాంఫట్ చేసేశారు. సూపర్‌సిక్స్ అంటూ చంద్రబాబు నిస్సిగ్గుగా ప్రజలకు టోపీ పెట్టేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఒక్క పథకం కూడా అమలు చేయకుండా.. అన్నీ ఇచ్చేశాం అంటూ జనాలను బురిడీ కొట్టిస్తున్నారు'' అని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం రామచంద్రాపురం, పాకాలలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సర్కారు వైఫల్యాలను ఎండగట్టారు.

- సూపర్‌సిక్స్‌ను అటకెక్కించిన చంద్రబాబు
- పథకాల పేరుతో ప్రజలకు టోపీ
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం : ఎన్నికల ముందు అబద్ధపు హామీలు గుప్పించి, అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను అటకెక్కించి రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ మండిపడ్డారు. మంగళవారం రాయలచెరువు సమీపంలోని ఓ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో ప్రజల ఆశలను నిచ్చెనగా చేసుకుని పీఠం ఎక్కిన బాబు ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. రాజధాని పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో పేదలందరికీ నవరత్నాల కింద సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు బూటకపు హామీలే ఆయుధాలుగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం సీట్లు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

భయపడే ప్రసక్తే లేదు

పాకాల : భౌతిక దాడులు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పాకాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అధికారం కోసం ప్రజలను మోసం చేసే నైజం ఒక్క చంద్రబాబు మాత్రమే ఉందని ఆరోపించారు. ఇప్పటికే కూటమి సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత తారస్థాయికి చేరిందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులందరూ తమ కుటుంబ సభ్యులే అని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు, ఎంపీపీలు లోకనాథం, మూలం బాబురెడ్డి, నేతలు కపిలీశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రహీం, వినాయక, భాస్కర్‌నాయుడు, పవన్‌కుమార్, రమేష్, చంటి, దాము, నాని, యతీశ్వర్‌రాడ్డి, జగన్నాథరెడ్డి, గోపి, వనజ, సునిత, రుకేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రామ్మూర్తి, ఈశ్వరయ్య, ఇమ్రాన్, మురళి, అశోక్, కున్ని, సెంథిల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి

వైఎస్సార్‌సీపీ నేత రాజేంద్ర మంగళవారం అకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో మోహిత్‌రెడ్డి వెంటనే ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శివయ్య సేవలో..

తిరుపతి రూరల్ : రామచంద్రాపురం మండలం రాయలచెరువు కట్ట వద్ద శివాలయంలో మోహిత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరిట స్వామికి అర్చన చేయించారు.

నోటీస్ బోర్డు

- పద్మావతి మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఆప్కో మెగా ఎగ్జిబిషన్.
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తారకరామ స్టేడియంలో ఉదయం 9 నుంచి అథ్లెటిక్స్ జోనల్ స్థాయి పోటీలు.
- గాంధీరోడ్డు ఏజీకే బిల్డింగ్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో సాయంత్రం 4.30 గంటలకు నూతన అధ్యక్షుడు ఆకుల సతీష్ మీడియా సమావేశం

ఎట్టకేలకు గ్రిల్స్ ఏర్పాటు



గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి: టవర్‌క్లాక్ ప్రాంతం నుంచి ఏరియా ఆస్పత్రికి వెళ్లే మార్గంలో గ్రిల్స్ విరిగిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడేవారు. దీనిపై జూలై 14వ తేదీన వాహనదారులకు తప్పని తిప్పలు శీర్షికతో సాక్షి పత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఎట్టకేలకు నూతన గ్రిల్స్ ఏర్పాటు చేయించారు.

జాగ్రత్తలతో క్షయ నివారణ

పాకాల : జాగ్రత్తలు తీసుకుంటే క్షయ వ్యాధిని నివారించవచ్చని దామలచెరువు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రవిరమ, డాక్టర్ అలెగ్జాండర్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆశ వర్కర్లకు టీబీ నివారణ విధానాలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది వెంకటరమణ, లక్ష్మి, బాలాజీ పాల్గొన్నారు.

సులభతరంగా పౌరసేవలు

చంద్రగిరి : ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా పౌర సేవలను మరింత సులభతరం చేశారని సర్పంచ్ ముదికుప్పం రూపా రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఈ మేరకు ప్రజల చేతిలో ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సుమారు 200 సేవలను ఇంటి నుంచే పొందేలా ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చినట్లు వివరించారు. పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరి బాధ్యతారాహిత్యం

తిరుపతి సిటీ: ప్రభుత్వ వైఖరి బాధ్యతారాహిత్యంగా ఉందని, 35 ఏళ్లపాటు సేవలందించిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ గౌరవ అధ్యక్షుడు టి.గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు చట్టబద్ధంగా రావల్సిన బెనిఫిట్స్‌ను కూడా చెల్లించకుండా మనోవేదనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిగా ఓ రిటైర్డ్ ఉద్యోగికి రూ.16లక్షల గ్రాట్యుటీని ఇప్పటి వరకు చెల్లించలేదని వెల్లడించారు. కడుపు కట్టుకుని పొదుపు చేసిన పీఎఫ్ నగదు కూడా చెల్లించలేకపోవడం దారుణమని, ఇందుకు పాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

తిరుపతి మంగళం : అలిపిరి చెక్ పాయింట్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందింది. అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరం స్వాధీనం చేసుకున్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాదులు

తిరుపతి రూరల్ : వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని న్యాయవాది రామచంద్రుడు, మల్లీశ్వరి తెలిపారు. మంగళవారం చంద్రగిరి ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళా వర్సిటీ అధ్యాపకులు అనురాధ, సీతా కుమారి, మాధురి పరదేశి, సునీత కాణిపాకం, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

సంక్షేమ చట్టాలపై అవగాహన అవసరం

–కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: సంక్షేమ చట్టాలపై తల్లిదండ్రులు, వయోవృద్ధులకు అవగాహన కల్పించాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్లకు చెందిన సంక్షేమ చట్టాలపై సమీక్షించారు. సంక్షేమశాఖ ఏడీ వినోద్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి, బాలకృష్ణమూర్తి తదితరులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లలతో సఖ్యత లేని కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తుతున్నాయన్నాయని చెప్పారు. పేదల్లోనే కాకుండా శ్రీమంతుల కుటుంబాల్లోనూ ఇటువంటి పరిస్థితి చోటుచేసుకుంటుందని తెలిపారు. తల్లిదండ్రులతోసహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన నుంచి లేదా అతని సొంత ఆస్తి నుంచి తనను తాను కాపాడుకోలేక పోయినప్పుడు ప్రాథమికంగా ఆర్డీఓ అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఆర్డీఓ ద్వారా నోటీసులు అందించి, విచారణ జరిపి సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తామని చెప్పారు. సామరస్యంగా పరిష్కారం కాని సమస్యలకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత కుమారులపైన, కుమార్తెలపైన చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ సిటిజన్‌లకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల ఆహారం, వైద్యం, వసతి, తదితర ప్రాథమిక అవసరాలను నెరవేర్చలేని వారి వారసులకు తల్లిండ్రులు సీనిరయర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమం చట్టం 2007 ప్రకారం మూడు నెలల వరకు జైలుశిక్ష లేదా రూ.5 వేల జరిమానా విధిస్తారని స్పష్టం చేశారు.

పోరాటమే ప్రధాన అజెండా



మురళిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : పోరాటమే ప్రధాన అజెండాగా సన్నద్ధమవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి స్పష్టం చేశారు. మంగళవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి టీటీడీ రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వెంటనే పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్ఎస్‌ను విస్తరించాలని, మన్నవరం ఎన్‌టీపీసీ, బెల్ ప్రాజెక్టులను పునఃప్రారంభించి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. సత్యవేడు, శ్రీసిటీ, శ్రీకాళహస్తి సెజ్‌లలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు 15 డిమాండ్లతో కూడిన తీర్మానాలను ప్రకటించారు. ఈ క్రమంలో ముందుగా సీపీఐ జిల్లా నూతన కమిటీని నియమించారు. జిల్లా కార్యదర్శిగా రెండోసారి మురళికి అవకాశం కల్పించారు. అనంతరం 14 మంది కార్యవర్గ సభ్యులు, ఆహ్వానితుడిగా పి.ఉదయ్‌కుమార్ ఎన్నికైనట్లు మురళి వెల్లడించారు. ఈ మేరకు మురళిని నేతలు ఘనంగా సత్కరించారు.

కొత్త అక్రిడిటేషన్లకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

చంద్రగిరి : వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్లు జారీ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు గల్లా సుబ్రమణ్యం ఆరోపించారు. రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు జర్నలిస్టు డిమాండ్ డే సందర్భంగా మంగళవారం వివిధ సమస్యలపై తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్రిడిటేషన్ లేక పోవడంతో జర్నలిస్టులు పలు సదుపాయాలను పొందలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు కొత్త అక్రిడిటేషన్లు జారీ చేయలేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్లకే గడువు పొడిగిస్తూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పొడిగింపుల జోలికి వెళ్లకుండా కొత్తవి జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ కార్డు పథకంలో లోపాలను సవరించి, మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని మన రాష్ట్రంలో సైతం ప్రారంభించాలని కోరారు. జర్నలిస్టులు సోమనాథ్ రెడ్డి, లీలాకృష్ణ, కన్నయ్య, మనోహర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రాజారెడ్డి, సురేష్, శంకర్, చంద్రశేఖర్, గోపాల్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపట్టిందని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో నగర పాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల్లోని స్టార్ పెర్ఫార్మర్లకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఒక కుటుంబం–ఒక వ్యాపారి అనే నినాదంతో ప్రతి మహిళా సంఘంలో ఒకరిని వ్యాపారిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందులో భాగంగానే మెప్మా ఎస్ఎంఈ ఫోరంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల్లో అత్యున్నత ప్రమాణాలతో వ్యాపారం చేస్తున్న వారిని స్టార్ పెర్ఫార్మర్లుగా గుర్తించామని వివరించారు. వీరు మరింత మెరుగ్గా వ్యాపారం సాగించేలా అవకాశాలు, నైపుణ్యాలు పెంపొందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటైల్, టెక్స్‌టైల్స్, ఫుడ్, బ్యూటీ వెల్‌నెస్, ఫర్నీచర్, వుడ్ ప్రొడక్ట్స్ వంటి వాటిలో మహిళా వ్యాపారవేత్తలు గ్లోబల్ స్థాయికి ఎదిగేలా ఆచరణాత్మక నైపుణ్యాలు, చర్చలు, నిపుణుల మెంటర్‌షిప్ అందించనున్నట్లు వెల్లడించారు. పలు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హెల్ప్ డెస్క్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. అనంతరం ఎస్‌యూఎల్ఎం డైరెక్టర్ సునీల్ కుమార్ యాదవ్ మహిళలతో చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో లీప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భవ్య శర్మ, ప్రాజెక్ట్ హెడ్ షీలా శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పథక సంచాలకుడు రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు కాపాడాలని డిమాండ్



మాట్లాడుతున్న అర్జున్

తిరుపతి కల్చరల్ : ఆర్‌టీసీ స్థలాలను కాపాడాలని, లులూ షాపింగ్‌మాల్‌కు కేటాయింపులను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. లులూకు ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ నంబర్ 137 జారీ చేయడం దుర్మార్గమన్నారు. విజయవాడలో సుమారు రూ.400 కోట్ల విలువైన స్థలాన్ని లులూకి కట్టబెట్టడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అక్రమ జీవో 137ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. లేకుంటే ఆర్టీసీలోని అన్ని సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. నేతలు జీఆర్ చంద్ర, మస్తాన్, ఈవీ కుమార్, మురగమ్మ, ఎస్ఎస్ మణ్యం, టీవీ బాబు, ఏబీఎస్ మణ్యం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో జీవితాలు పునీతం



మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

తిరుపతి కల్చరల్ : ఆధ్యాత్మిక భావనతో జీవితాలు పునీతమవుతాయని భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు తెలిపారు. ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆశ్రమం దశమ వార్షిక వేడుకల్లో భాగంగా చివరి రోజు మంగళవారం 'పురుషుల యువజన సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకుంటూ జంతువులను ప్రేమించాలన్నారు. మన సంస్కృతి, ఆధ్యాత్మికతలపై రామకృష్ణ మిషన్ అనేక పుస్తకాలు ప్రచురించిందని వెల్లడించారు. స్వామి సుకృతానంద మాట్లాడుతూ ఆశ్రమ కార్యక్రమాలు దేశంలోనే కాకుండా శ్రీలంక, బంగ్లాదేశ్‌లో కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం ఎస్వీ ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, నెల్లూరు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి హృదయానందజీ, విజయవాడ ఆశ్రమ సహాయ కార్యదర్శి స్వామి శితికంఠనందజీ ప్రసంగించారు.

స్వామినాథన్ శత జయంతి వేడుకలు రేపు



మాట్లాడుతున్న రాజగోపాల్

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూ సెనెట్ హాల్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు గ్లోబల్ ఐకాన్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ అధ్యక్షుడు డాక్టర్ వి.రాజగోపాల్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు పౌష్టికాహారం అందించేందుకు విశేషంగా కృషి చేసిన మహనీయుడు స్వామినాథన్ అని కొనియాడారు.

'ఎస్వీసీసీ' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ మంగళవారం విడుదల చేసిన డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలలో బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బీకాం, బీబీఏ, బీసీఏ కోర్సుల్లో వెంకట సుధీర్, హేమలత, రవీంద్ర నాయక్, రేవతి, సంతోష్, షేక్ ఆఫ్రిన్, బిందు, రంజిత, కోకిల, యమున, మాధవి, సునీల్ కుమార్ 8.75 నుంచి 8.80శాతం సాధించినట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. తమ విద్యార్థులు 94శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటినట్లు వెల్లడించారు.

ఏపీ హంస ప్రధాన కార్యదర్శిగా రాజా



తిరుపతి తుడా: ఏపీ హంస రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన రాజాను ఎన్నుకున్నారు. అమరావతిలో మంగళవారం నిర్వహించిన ఏపీ హంస రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఏపీ హంస చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా రాజా విశేష సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది.

రుయాలో పురిటి బిడ్డకు పునర్జన్మ



చంటి బిడ్డతో వైద్య బృందం

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో పురిటి బిడ్డకు వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. బిడ్డకు విజయవంతంగా శస్త్ర చికిత్సను చేపట్టినట్లు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రావు తెలిపారు. 40 రోజుల పసి బిడ్డ ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్ర గాయమైందని, తలలో రక్తం గడ్డ కట్టడంతో పాప ప్రాణాలకే ప్రమాదం ఏర్పడిందన్నారు. న్యూరాలజీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ అనంత కిరణ్ కుమార్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్తో పాటు అనస్థీషియా విభాగ వైద్యులు సంయుక్తంగా చిన్నారికి శస్త్ర చికిత్సను చేపట్టారు. చిన్నపిల్లల ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ జయచంద్ర నాయుడు, డాక్టర్ రాధా, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.